

"హిమాద్రౌ హిమ విక్రయః"

మంచుకొండలో మంచు అమ్మితే ఎవరు కొంటారు?

దుర్భర దరిద్రభారంతో నడుములు విఱిగి నవసిపోతున్న వారికి పేదఱికం గూర్చి చెప్పడం ఏమిటి?

నానా విధాలా కలుషితాలయిపోతున్న జనపదాలను గూర్చి జానపదులకు చెప్పడం అంతకాక మఱెంత?

అన్నమానం వంచిన నడుం ఎత్తకుండా చాకిరీ చేస్తూ చావలేక బదుకుతూ, బదకలేక చస్తూ వస్తులుంటూ ఉన్న ఆడవారికి ఆడబ్రతుకే మధురం—అని ఆడినా పాడినా ఏం లాభం?

అలాగే మనం చాలా పనులు చేస్తుంటాము. చాలా చాలా నీతులు చెప్తుంటాము.

అసలు ఎక్కడ ఏది ప్రబలంగా ఉంటే అక్కడ దాని ప్రస్తావన, అభివర్ణన ఎందుకూ పనికిరాదు.

కులమత విభేదాలు మిన్నుముట్టి ఒకరి నొకరు తన్నుకునే చోట వెళ్ళి వాటిని గుఱించి చెప్తే ఎందుకు పనికి వస్తుంది?

అలా అనుకునే వివేకం, విచక్షణా మనలో లోపించినందువల్లనే ఇలా జరుగుతూ ఉంటుంది.

** ** **

ఎప్పుడూ వానచినుకు పడక అనావృష్టితో దుర్భిక్ష నిలయంగా ఉన్న ప్రాంతంలో వెళ్ళి చాలామంది చేస్తున్న పని అదే.

ఆ కఱవినో కాటకాన్నో ఎంతో కొంత తగ్గించే వెఱవులేవైనా చూచి, వాటిని అమలు జరపడానికి ప్రయత్నిస్తే తప్పా వట్టి మాటలతో చేయగలది ఏమీ లేకపోగా వారిలో మఱింత ఈ ప్రవక్తలూ, వక్తలూ చేసే ప్రసంగాలమీద అసహ్యం కలుగుతుంది.

ఎప్పుడూ కక్షలతో కార్పణ్యాలతో ఒకరినొకరు పొడుచుకొని చస్తున్నచోట గ్రామ జీవితం ఎంత హాయిగా ఉన్నదంటూ అన్నా అంతే.

అటువారి దురవస్థలను అర్థం చేసుకోగలగాలి, లేదా వాటిని గూర్చి అక్కడి వారికి తెలివిడి చెయ్యడానికైనా ఏదో అపూర్వ ఫణితులలో ఆడంభం చెయ్యాలి.

అంతేకానీ తెలిసినచోటనే ఆ తెలిసిన దానినే కూడా మన మాటలలో తెలియజెయ్యడం గానీ, అసలది తెలియక వక్రంగానో, వయ్యారంగానో చిత్రించడం గానీ ఎందుకు వచ్చిన కంఠశోష.

కొన్ని పడికట్టు రాళ్ళలాంటి మాటలు పేర్చుకుంటూ చిలకపలుకులు పలకడం, అది తమ చెవులకు శ్రావ్యంగా ఉంటుంది కనుక బాగుబాగని తామే మెచ్చుకోవడం తప్పితే ఎక్కువమంది మఱొక మార్గాన్ని అవలంబించడం లేదు.

నిజంగా నిజాయితీగా మెలగుతూ అచ్చస్వచ్ఛ చరిత్రలవారు ప్రత్తిచోటా ఎప్పుడూ ఒకరో ఇద్దఱో ఉండనే ఉంటారు.

వారి దగ్గఱకు వెళ్ళి శీలంగూర్చి వాకొనడం, అలా కాక పూర్తిగా చరిత్రహీనుల వద్దకు వెళ్ళి అందును గూర్చి నొక్కి వక్కాణించడం రెండూ ఒకటే.

మీకు తెలియందేముంది?—అంటూనే తెలిసిన వారికే తెలియజెప్పడానికి సాహసించేవారు పలువురు.

పైకి అలా అన్నా వారికంటే, తమకే ఎక్కువ తెలుసును అనుకుంటూ ఉంటారేమో అదే అలా వెలనాడడానికి మూలం అవుతుంది.

ఎల్లప్పుడూ ఒకటే పాటగా, పాడిందే పాటగా పాడి పాడి అలిసిపోతూ తామేదో మానవ సేవ చేస్తున్నామని భావిస్తే అదేమంత బాగు!

ఆలయాల లోనికి వెళ్ళి భక్తి ప్రబోధించెయ్యడం, భాగవతోత్తముల వద్దకు వెళ్ళి అధర్మాలను ఏ కరువు పెట్టడం ఇవన్నీ అంతే.

ఈ చర్విత చర్వణాలూ, వాటిలోనే శాఖాచంక్రమణాలూ ఎక్కువకావడంవల్లనే మనకు వ్రాతలు మెడుగుతున్నవి కాని అందువల్ల కలుగవలసిన ప్రయోజనం కలగడం లేదు.

** ** **

ఎక్కువగా ఇలాంటివి జరగడానికి మనకు కాలం విలువ త్రెలియనందువల్లనే.

కాలక్షేపం మనకు కావలసిన వానిలో ఒకటి.

అలా కాలహరణం చేసుకుంటూ మన కాలాన్నే కాక ఎదుటివారి కాలాన్ని కూడా హరిస్తూ మనం ఎంతవరులకు అపకారం చేస్తున్నామో తెలియదు.

ఉబుసుపోకకు కబుర్లు చెప్పుకుంటూ వాటికేదో ధర్మప్రబోధం వంటి పేర్లు పెట్టుకుంటూ మనల మనం మోసపుచ్చుకోవడం మనలకు ప్రశ్నతో బెట్టిన విద్య.

కాకపోతే ఎవరో ఏదో పదవి రాగానే తనకు కవిత్వం తలా తోకా తెలియకపోయినా కవి పండిత సభలలో మీరిలా రాయాలి, మీ రుజవానికి దగ్గఱ కావాలా అదీ ఇదీ అని గంటల తరబడి ప్రబోధించడానికి సాహసిస్తారా?

ఒకప్పుడు ధనం, ఇప్పుడు పదవి సర్వజ్ఞాత్వాన్ని ప్రసాదిస్తున్నది.

కావుననే ఏమీ తెలియని వాని గూర్చి అలా వాగడం.

కవులకు కవిత్వాన్ని గూర్చి చెప్పడం హిమాలయాల్లో హిమం అమ్ముకోవడానికి ప్రయత్నించడం కాక మఱేమిటి?

—విశ్వం

## కాలం కథ

# ఉపకారం

'లోన్' అందుకుని ఆఫీసు నుంచి బయటపడ్డాడు శంకర్రావు. అదను చూసి వెంటపడ్డాడు అప్పారావు- రెండొందలు అప్పు కావాలని.

"సారీ! సర్దలేను. చెల్లి పెళ్ళికి ఇంకా కావాలి" అన్నాడు శంకర్రావు అనకాపల్లికి వెళ్ళాలనే తొందరలో. బస్సు రెండు గంటలకుంది.

"పదిహేను రోజుల్లో అప్పు తీరుస్తా" అన్నాడు అప్పారావు.

"సారీ వీలవదు" అంటూ ఇంటి ముఖం పట్టాడు శంకర్రావు.

పెళ్ళానికి బాగులేదని, అబ్బాయి పుస్తకాలకనీ, అమ్మాయిని బళ్ళో వెయ్యాలనీ, ఇంకా మందుల కనీ, మాకుల కనీ అప్పు అడిగి అర్జెంటుగా బార్‌లో దూరటం అప్పారావు 'స్టైల్'. శంకర్రావు దగ్గర అరవై రూపాయలు తీసుకున్నాడు. ఇస్తాననడు. ఇవ్వడు. శంకర్రావూ సామాన్యుడే.

భార్యకి చెప్పి ఇంటి నుంచి ఓ అరగంటలో బస్సు స్టాండు చేరాడు శంకర్రావు. అక్కడ రెడీగా ఉన్నాడు శంకర్రావు కోసం అప్పారావు.

"బస్సుకి టైమయింది. కాఫీ తాగుదాం" అన్నాడు.

కాఫీతో వదుల్చుకుందా మనుకొని సరే అన్నాడు. కాఫీ బిల్ అప్పారావే ఇచ్చాడు. శంకర్రావు లొంగలేదు.

"పర్సు జాగ్రత్త" అన్నాడు అప్పారావు- అతని పేంటు జేబు చూస్తూ. "ఒకటి రెండూ కాదు. మూడు వేలు" హెచ్చరించాడు.

శంకర్రావు భయపడుతూ చుట్టూ చూశాడు. ఎవరైనా విన్నారేమో అని.

బస్సు వచ్చింది. రద్దీ ఉంది. నెమ్మదిగా ఎక్కాడు శంకర్రావు. నిలబడ్డాడు.

"శంకర్రావు గారూ! వెళ్ళి రండి. సొమ్ము జాగ్రత్త! పర్సు జాగ్రత్త! పాంటుకి పిన్ను పెట్టండి. బస్సులో దొంగలుంటారు" అని కింద నుంచి అరుస్తున్నాడు అప్పారావు.

కంగారు పడుతూ నలు దిక్కులా చూశాడు శంకర్రావు. అందరూ. వింటున్నారు.

"ఆ భయమేమీ లేదు. బ్యాంకుకెళ్ళి 'డ్రాఫ్టు తీసుకుని వెంటనే పంపించాను. నేను నర్సీపట్నం వచ్చేసరికి అనకాపల్లి చేరుతుంది డ్రాఫ్టు. ఇలాంటి బస్సులో డబ్బుతో ప్రయాణమా? వస్తా" అని అందరికీ వినపడేటట్టు చెప్పాడు శంకర్రావు. అప్పారావు తెల్లబోతూంటే బస్సు కదిలింది.

నిజానికి సొమ్ము అతని లోపలి బనియను జేబులో పదిలంగా ఉంది. అప్పారావు లాంటి ఉపకారులు ఉంటారు మరి!

జయంతి వెంకట రమణ